నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 12 మే 2024 RANGAREDDY

మూగబోయిన మైకులు
జోరుగా ప్రచారం చేసిన వివిధ పార్టీల అభ్యర్థులు
బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్
గెలుపే ధ్యేయంగా కదనరంగంలో ముందున్న బీఆర్ఎస్ శ్రేణులు

ప్రచారానికి తెర..

బొంరాస్‌పేట, మే 11 : లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడింది. ఐదు గంటలకే మైకులు మూగబోయాయి. దాదాపు నెల రోజులపాటు ఆయా పార్టీలు ప్రచారాన్ని జోరుగా నిర్వహించాయి. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉండగా, కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో ఉండగా.. మహబూబ్‌నగర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్లలో బహిరంగసభ నిర్వహించి ప్రచారం చేశారు. అన్ని తానై మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి కాసానికి మద్దతుగా మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. తాండూరులో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బీఆర్ఎస్ తరపున ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కాసాని బీసీ నేత కావడంతో బీసీ నినాదాన్ని నేతలు ప్రచారంలో జనంలోకి బలంగా తీసుకెళ్లారు. క్యాడర్ సైతం సమరోత్సాహంతో కాసాని గెలుపుకోసం కదం తొక్కింది. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి పవర్‌లోకి రావడం.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం..అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. బీజేపీ పదేండ్ల పాలనలో తెలంగాణకు చేసిన అన్యాయాన్ని, మత పరంగా ఓట్లడిన తీరును బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లింది. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభలకు కూడా ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇక కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ సాధించేలా కిందిస్థాయి శ్రేణులు కూడా ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. చివరి రోజైన శనివారం జిల్లాలో ప్రచారం హోరెత్తింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్ల, తాం డూరు, కొడంగల్‌లలో ప్రచారం నిర్వహించగా ప్రియాంకగాంధీ తాండూరు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ తరపున కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రచారంలో పాల్గొన్నారు.

కడ్తాల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన జనంతో కిక్కిరిసిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

- నెల రోజుల బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన
- జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ శ్రేణుల విస్తృత ప్రచారం
- చేవెళ్లలో కేసీఆర్ సభ, కార్నర్ మీటింగ్, మార్నింగ్‌వాక్‌లతో సందడే సందడి
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన రోడ్ షోల్లో పాల్గొన్న మాజీ మంత్రి సబితారెడ్డి
- బీసీనేత కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతు ప్రకటించిన కులసంఘాలు
- చివరి రోజు గడగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించిన పార్టీ శ్రేణులు

హోరాహోరి.. హ్యాట్రిక్‌పై గురి..

షాబాద్, మే 11: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. గత నెల 13వ తేదీన చేవెళ్లలో నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ నాయకులు, నేతల్లో నూతనోత్తేజాన్ని నింపింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు దాదాపు నెల రోజులుగా జిల్లా స్థాయి నుంచి నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజల పడుతున్న ఇబ్బందులను ప్రతి గడపకూ తీసుకెళ్లారు. బీఆర్ఎస్ ఆరు ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించడంతో ఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

చేవెళ్ల సీటు బీసీనేత కాసాని జ్ఞానేశ్వర్‌కు కేటాయించడంతో వివిధ బీసీ కుల సంఘాలన్నీ సమావేశాలు నిర్వహించి కాసానికి స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న నాయకుడు, 96 బీసీ కులాలను ఏకం చేసి వారి సమస్యలపై పోరాటం చేసిన జ్ఞానేశ్వర్‌ను గెలిపించడమే లక్ష్యంగా కులసంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా..

చేవెళ్ల గడ్డపై హ్యాట్రిక్ విజయం సాధించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతున్నది. చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మరంగా సాగింది. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఇక్కడ ఘన విజయం సాధించింది. గతంలో ఈ పార్టీ నుంచి గెలిచిన గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీల నుంచి బరిలో నిలువగా.. ప్రజల నుంచి వారికి మద్దతు కరువైంది. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి మూడోసారి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పని చేశాయి. సుమారు 29 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా, అందులో 16లక్షల వరకు బీసీ ఓటర్లు ఉండడం కాసాని గెలుపునకు కలిసి రానున్నదని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

కేసీఆర్ సభతో నయా జోష్..

చేవెళ్లలో గత నెల 13వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. చేవెళ్ల సభకు అనుకున్న దానికంటే జనాలు అధిక సంఖ్యలో రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ విజయం ఖాయమని చెబుతున్నారు. నేతలు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున రోడ్ షోలు నిర్వహించారు. శనివారం ప్రచారం చివరి రోజు కావడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారాల్లో పాల్గొన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముస్లిం, మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ చేవెళ్ల మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ ఘని

'కాసాని'కే మా మద్దతు

చేవెళ్లలోని ముస్లిం, మైనార్టీలు

చేవెళ్ల రూరల్, మే 11 : బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ బలపర్చిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కే తమ మద్దతంటూ చేవెళ్లకు చెందిన ముస్లిం, మైనార్టీలు, పలు సంఘాల నాయకులు జై కొట్టారు. శనివారం మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామ రెవెన్యూలోని బర్కల రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన సమావేశంలో ముస్లిం, మైనార్టీలు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే ముస్లిం, మైనార్టీలకు అనేక పథకాలు అందాయన్నారు. కుమార్తెల వివాహాలకు షాదీముబారక్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, రైతుబంధు, రైతు బీమా, ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు తదితర పథకాలను అమలు చేశారన్నారు. ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరు చెప్పుకొని రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సెక్యులర్ విధానాలను పాటిస్తున్నారని.. ఆయన హయాంలోనే ముస్లిం, మైనార్టీలు సంతోషంగా జీవించారన్నారు. అందువల్ల ఆయన బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌కే తమ ఓటు అని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అల్లు డు వెంకట్, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ నారాయణ, బీఆర్ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌ఘని, మల్కాపూర్ మాజీ ఉప సర్పంచ్ సయ్యద్‌జాఫర్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఇక్రముద్దీన్, సయ్యద్ సద్దాం, సయ్యద్ అస్లాం, మోదిన్, ఇనూస్, సయ్యద్ మజార్, కురుమ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మల్కాపూర్ మాజీ సర్పంచ్ శివారెడ్డి, మహేశ్, చింటు, సత్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

కారు గుర్తుకు ఓటేసి బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పండి... మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

నందిగామ, మే 11: అభివృద్ధి ప్రజా సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. నందిగామ మండలంలోని చేగూర్ గ్రామంలో శనివారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై గ్రామస్తులు, బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిన కేసీఆర్‌కు మన్నె శ్రీనివాస్ రెడ్డి గెలుపును కానుకగా ఇద్దామన్నారు. చేగూర్‌లో ఇంత పెద్దఎత్తున సభ ఏర్పాటు చేసిన విఠల్‌యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సంతోశ్, నాయకులు రాజు, సురేశ్‌గౌడ్, శేఖర్, యాదయ్య, శేఖర్‌చారి, విజయ్, బబ్బులు, శ్రీను, రాజేశ్, కార్తికేయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్

మోసపూరిత కాంగ్రెస్, బీజేపీలను ఓడించండి

కాసాని జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి.. ప్రచారంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో కపట కాంగ్రెస్, మోసపూరిత బీజేపీలను ఓడించాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని పాత తాండూరు, రాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌కాలనీలలో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకాని హామీలిచ్చే దొంగ పార్టీలను నమ్మరాదన్నారు. 60 ఏండ్లలో చేయని రాష్ట్ర అభివృద్ధిని తొమ్మిదిన్నరేండ్లలో కేసీఆర్ చేసి చూపించారన్నారు. బీఆర్ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.1648.12 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను నిండా ముంచిందన్నారు. మరిచిపోయి కూడా కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయకూడదని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి 96 కులాలను ఏకం చేసిన బీసీల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

స్వేచ్ఛగా ఓటేయండి

అన్ని ఏర్పాట్లు పూర్తి

విలేకరుల సమావేశంలో రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం : డీసీపీ శ్రీనివాస్

షాబాద్, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని.. ఓటరు కార్డు లేనిచో ఈసీ నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక దానిని వెంట తెచ్చుకుని ఓటువేయొచ్చన్నా రు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని.. వాస్తవానికి ప్రతిసారీ సాయంత్రం 5గంటల వరకే పోలింగ్ గడువు ముగిసేదని.. ఈసారి దానిని మరో గంట పాటు ఈసీ పొడిగించిందన్నారు. ఓటర్లకు 99. 23% మేర ఓటరు స్లిప్పులను బీఎల్వోల నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారన్నారు. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచే నిఘాను పటిష్టం చేశామని.. నిఘా బృందాల సంఖ్యను రెట్టింపు చేసి తనిఖీలను ముమ్మరం చేశామని కలెక్టర్ చెప్పారు. నిశ్శబ్ద వ్యవధి(సైలెన్స్ పీరియడ్)గా పరిగణించబడిన పోలింగ్‌కు 48గంటల ముందు ప్రచార కార్యక్రమాలు నిషేధమన్నారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లుండ గా.. 2877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటర్లకు అన్ని వసతులు కల్పించామని.. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా, సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ జరిపేలా ఏర్పాట్లు చేశామన్నారు. బరిలో 43 మంది అభ్యర్థులు ఉన్నందున పోలింగ్ కోసం మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. పోలిం గ్ కేంద్రాల సంఖ్య కంటే 25శాతం అదనంగా లెక్కిస్తూ(రిజర్వు) బ్యాలెట్ యూనిట్లు 10757, కంట్రోల్ యూనిట్లను 3591 కేటాయించడం జరిగిందని, వీవీప్యాట్లు 4008 కేటాయించామన్నారు. ఆదివారం సాయంత్రం అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు సామగ్రితో చేరుకుంటారన్నారు. శేరిలింగంపల్లి సెగ్మెంట్‌కు సంబంధించి జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, మహేశ్వరం సెగ్మెంట్‌కు సంబంధించి గుర్రంగూడలోని స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో, రాజేంద్రనగర్ సెగ్మెంట్‌కు సంబంధించి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, బండారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, వికారాబాద్ సెగ్మెంట్‌కు వికారాబాద్‌లోని మేరీ నాట్ స్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, తాండూరు సెగ్మెంట్‌కు సంబంధించి తాండూరులోని సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ హై స్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పరిగి సెగ్మెంట్‌కు సంబంధించి పరిగి మినీ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భద్రత కట్టుదిట్టం..

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు బృందాలతో కూడిన టీంలు, క్విక్ రెస్పాన్స్ టీంలు, ఏసీ పీల స్థాయిలో స్టాటికింగ్ ఫోర్సు, డీసీపీ, సీపీ, ఏడీజీ స్థాయుల్లో పర్యవేక్షణ ఉంటుంద న్నారు.

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు చేవెళ్ల లోక్‌సభ పరిధి లో రూ.10,70,16,937 నగదు, రూ.1,76,12,006 లక్షల విలువ చేసే మద్యం, రూ.5,05,03,026 విలువ చేసే 1,84,68,203 కిలోల గంజాయి, రూ.31,14, 44,388 విలువ చేసే బంగారు, రూ. 30,34,700 విలువ చేసే సిల్వర్ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం సాయంత్రం 6గంటల అనంతరం బహిరంగ ప్రచారం నిషేధమని.. స్థానికేతరులు తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఓటింగ్ కోసం 13 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపాచ్చు

ఈ నెల 13న జరగనున్న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నిక సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే టప్పుడు 13 రకాల కార్డులలో ఏదైనా ఒకదానిని తమ వెంట తీసుకువెళ్లాలని రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఫొటోతో ఉన్న పోస్ట్ ఆఫీస్/బ్యాంకు పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు తదితర వాటిలో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

24/7 అప్రమత్తంగా..

- లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 మంది
- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 11 : లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు వికారా బాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. మే 13న జరుగనున్న ఎన్నికల కోసం జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పోలీస్ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు 24/7 అప్రమత్తంగా ఉంటారన్నారు. జిల్లాలో మొత్తం 9,84,0 68 మంది ఓటర్లుండగా.. 113 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నిఘా నీడలో పోలిం గ్ జరుగనున్నదన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడితే సీ-విజిల్ యాప్‌లో గానీ, 1950 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ఓటరు స్లిప్పులను బీఎల్వోల నేతృత్వంలో సిబ్బంది అందిస్తు న్నారని.. ఇప్పటివరకు 99% వరకు పూర్తైందన్నారు. స్లిప్పుల రాని వారు పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బీఎల్వోల నుంచి తీసుకోవాలన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వెళ్తారని.. పోలింగ్ సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు పోలీస్ భద్రత మధ్య చేరుకుంటాయని.. వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్ల ఎన్నికల బాక్సులు చేవెళ్లకు.. కొడంగల్ నియోజకవర్గానికి చెందినవి మహబూబ్‌నగర్‌కు వెళ్తాయని వివరించారు. ఈవీఎంలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అదనంగా యంత్రాలను అందుబాటులో ఉంచామని.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పెంచామ న్నారు. ఇప్పటివరకు సీ- విజిల్ యాప్ ద్వారా 68 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ నారాయరెడ్డి తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి